క్లుప్తంగా

కల్యాణలక్ష్మి పేదలకు వరం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రసమయి

ఇల్లంతకుంట: నిరుపేద ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి పథకం వరంలాంటిదని మానకొండూర్ ఎమ్మెల్యే, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని జంగంరెడ్డిపల్లి గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన కుమ్మరవేని బుచ్చయ్య-కళ దంపతుల కూతురు అఖిలకు రూ.లక్ష 116 కల్యాణలక్ష్మి చెక్కు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడబిడ్డల పెళ్లి తల్లిదండ్రులకు భారం కావొద్దనే ఉద్దేశ్యంతో సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, ఎంపీపీ వెంకటరమణారెడ్డి, సర్పంచ్ శ్రీలత, ఉపసర్పంచ్ ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



ఊరేగింపుగా వెళ్తున్న గంగపుత్రులు

రుద్రంగి: మండల కేంద్రంలోని మహాలక్ష్మి గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో బుధవారం పోచమ్మ, మహాలక్ష్మీ అమ్మవార్ల బోనాల పండగ ఘనంగా జరిగింది. గంగపుత్ర మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవార్లకు బోనాలు సమర్పించుకున్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఎల్ల గంగాధర్, ఉపాధ్యక్షుడు దేశవేణి గంగాధర్, కార్యవర్గసభ్యులు దేశవేణి శ్రీనివాస్, ధర్మేందర్, భూమేశ్, భూమయ్య, ధర్మపురి, సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

గర్భిణులకు పోషకాహారంపై అవగాహన



గర్భిణులకు పండ్లు అందజేస్తున్న డాక్టర్ శంకర్

ముస్తాబాద్: గర్భిణులకు పోషకాహారంపై ముస్తాబాద్ పీపుల్స్ హాస్పిటల్‌లో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. జీఎస్‌కే ఫార్మ సౌజన్యంతో పీపుల్స్ హాస్పిటల్స్ సంయుక్తంగా గర్భిణులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. పుట్టబోయే శిశువులకు పోషకాహారం ఎలా అందించాలో వివరించారు. సుఖ ప్రసవాలకు, ఆరోగ్య శిశువుల జననానికి న్యూట్రిషన్ ఫుడ్ ఎంతో అవసరమని డాక్టర్ చింతోజు శంకర్ అన్నారు. డాక్టర్లు అర్చన,అఖిల, శరత్‌చంద్ర, నరేశ్ పాల్గొన్నారు.

అసంపూర్తిగా రోడ్డు విస్తరణ

- ఐదేళ్లుగా సాగుతున్న పనులు
- కల్వర్టులు, వంతెనల నిర్మాణం పెండింగ్
- ప్రయాణికులకు తప్పని పాట్లు
- పట్టించుకోని అధికారులు



కంకరతో ఉన్న రహదారి



తెర్లుమద్ది శివారులో ఎత్తైన రోడ్డు కింద కల్వర్టు

ముస్తాబాద్: ముస్తాబాద్–జిల్లెల్ల రహదారి విస్తరణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఐదేళ్లుగా సాగుతున్న రహదారి విస్తరణ పనుల్లో పురోగతి కనిపించడం లేదు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పలుచోట్ల అసంపూర్తి పనులతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. పదుల సంఖ్యలో క్షతగాత్రులయ్యారు. ముస్తాబాద్ మండలం తెర్లుమద్ది మీదుగా తంగళ్లపల్లి మండలం భరత్‌నగర్, ఇందిరానగర్ మీదుగా జిల్లెల్ల వరకు 11 కిలోమీటర్ల రహదారిని రూ.23.10 కోట్లతో ఆర్ అండ్‌బీ పనులను ఐదేళ్ల క్రితం చేపట్టారు. ఇప్పటికి పనులు జరుగుతుండగా అక్కడక్కడ వదిలేసిన పనులతో పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రయాణం ప్రమాదకరం

ముస్తాబాద్ నుంచి తెర్లుమద్దికి వెళ్లే దారి ప్రమాదకరంగా మారింది. రెండు చోట్ల విస్తరణ పనులను వదిలేశారు. అక్కడున్న కల్వర్టులు రోడ్డు కంటే కిందికి వుండడంతో వర్షానికి మట్టి జారిపోతోంది. కల్వర్టు రోడ్డు కంటే చిన్నగా ఉంది. దీంతో ఇక్కడ వేగంగా వచ్చే వాహనాలు అదుపు తప్పి రోడ్డు కిందికి వెళ్తున్నాయి. కొత్తగా ఈ దారిలో ప్రయాణించే వారు ప్రమాదాల బారిన పడుతున్నారు. గతంలో ఇక్కడ రోడ్డుపై నుంచి వెళ్లే విద్యుత్ తీగలతో ప్రమాదం జరుగుతుందని కల్వర్టును చిన్నగా నిర్మించారు. ప్రస్తుతం విద్యుత్ తీగల సమస్యలను స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ చూపి బాగు చేయించారు. అయినా బీటీ పనులు చేయడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు చోట్ల 120, 140 మీటర్ల పరిధిలో బీటీ వేయాల్సి ఉంది. ఇక రహదారి విస్తరణ పనులు తెర్లుమద్ది వరకు, అక్కడి నుంచి భరత్‌నగర్ వైపు వెళ్లే పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. రెండు చోట్ల కల్వర్టు పనులు పూర్తి కాలేదు. అలాగే నక్క వాగుపై నిర్మించే భారీ వంతెన పనులు ఇంకా కొనసాగుతున్నాయి.

అటవీ శాఖ అభ్యంతరాలు

తెర్లుమద్ది నుంచి జిల్లెల్ల వరకు ఉన్న అటవీ శాఖ భూములతో పనులు ఆలస్యమవుతున్నాయని ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులంటున్నారు. ఐదేళ్లుగా అటవీశాఖ క్లియరెన్స్ చేయించుకోవడంలో ఆర్‌అండ్‌బీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. భరత్‌నగర్ వద్ద నిర్మించే వంతెన, రహదారి విస్తరణకు సంబంధించిన భూమి వివరాలను అటవీశాఖకు అందించడంలో జాప్యం చేశారనే చర్చ జరుగుతోంది. తెర్లుమద్ది గ్రామస్తులు ఈఈ, డీఈలకు ఫిర్యాదు చేసిన అధికారులు స్పందించలేదని అంటున్నారు. చివరకు మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లడంతో ముస్తాబాద్ నుంచి తెర్లుమద్ది వరకు పనులు పూర్తి చేశారు. అయితే రెండుచోట్ల పనులు నిలిపివేయగా ఇప్పుడదే ప్రమాదకరంగా మారింది. అయితే ప్యాచ్, మిగులు పనులను భరత్‌నగర్‌లో పనులు చేపట్టిన ప్పుడే, ఇక్కడ చేపట్టేలా అధికారులు కాంట్రాక్టర్‌కు సహకరిస్తున్నారని తెర్లుమద్ది ప్రజలు ఆరోపిస్తున్నారు. అటవీశాఖ పరిధిలోని నాలుగు కిలోమీటర్ల పనులు త్వరగా చేపట్టాలని మండల వాసులు కోరుతున్నారు.

ఫిర్యాదు చేసిన స్పందన లేదు



తెర్లుమద్ది వరకు మిగిలిపోయిన పనులు చేపట్టాలని ఆర్‌అండ్‌బీ అధికారులను కోరిన స్పందన లేదు. ఇప్పటికే చాలామంది ఇక్కడ ప్రమాదాల బారిన పడ్డారు. అనేక మందికి గాయాలయ్యాయి. రాత్రివేళల్లో వేగంగా ప్రయాణించేవారు కల్వర్టుల వద్ద అసంపూర్తి పనుల వద్ద ప్రమాదాలకు గురవుతున్నారు.

– కిషన్‌రావు, సర్పంచ్, తెర్లుమద్ది

కాంట్రాక్టర్‌కు లాభం చేకూర్చేందుకా?



ముస్తాబాద్ నుంచి తెర్లుమద్ది వరకు మిగిలిపోయిన ప్యాచ్‌వర్క్‌లను పూర్తి చేయడం లేదు. అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసి, కరెంట్ తీగల సమస్య మేమే పరిష్కరించుకున్నాం. జిల్లెల్ల వైపు పనులు నిలిచిపోవడంతో ప్యాచ్ పనులు చేయడం లేదు. ఇదంతా కాంట్రాక్టర్‌కు లాభం చేకూర్చేలా అధికారులు వ్యవహరిస్తున్నారు.

– బైతి నవీన్, తెర్లుమద్ది

అధికారులకు నివేదించాం



మిగులు పనులు పూర్తిచేసేందుకు అధికారులకు నివేదించాం. కాంట్రాక్టర్‌తో కూడా మాట్లాడాం. జిల్లెల్ల వైపు ఉన్న రహదారి పనులు మిగిలివున్నాయి. ఇటువైపు ప్యాచ్‌వర్క్‌లను త్వరలోనే పూర్తి చేయిస్తాం. ఎవరికీ ఇబ్బంది కలగకుండా పనులు చేపడుతాం. కల్వర్టుల ఎత్తు పెంచుతాం. ఆ పనులను త్వరలోనే చేస్తాం.

– నరేందర్, ఏఈ, ఆర్‌అండ్‌బీ, ముస్తాబాద్

సర్కార్ బడి బెస్ట్



ఎల్లారెడ్డిపేట: బొప్పాపూర్‌లో..



బోయినపల్లి: విలాసాగర్‌లో

ఎల్లారెడ్డిపేట/బోయినపల్లి/కోనరావుపేట: ప్రైవేట్ బడులు వద్దు.. ప్రభుత్వ పాఠశాలలే ముద్దు అంటూ సర్కార్ పాఠశాలలను కాపాడుకోవాలని కోరుతూ ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్, బోయినపల్లి మండలంలోని విలాసాగర్, కోనరావుపేట మండలం మామిడిపల్లిలో బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట భాగంగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు కలిసి గ్రామంలో ర్యాలీలు తీశారు. ఉపాధ్యాయులు గ్రామంలో పలువురి ఇళ్లలోకి వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న వసతులు, సౌకర్యాల గురించి ప్రజలకు వివరించి విద్యార్థులను చేర్చుకున్నారు. బోయినపల్లిలో ఇద్దరు విద్యార్థులు చేరినట్లు ఎంఈవో శ్రీనివాసదీక్షిత్ తెలిపారు.

చిత్రకథ



ప్రమాదకరంగా కల్వర్టు

మున్సిపల్ పరిధిలోని 1, 2 వార్డుల పరిధిలోని శాత్రాజ్‌పల్లి గ్రామంలో డ్రెయినేజీ చెడిపోయి నెలలు గడుస్తున్నా మరమ్మతు నోచుకోవడం లేదు. వేములవాడ రాజన్న సన్నిధికి జగిత్యాల ప్రాంతం నుంచి వచ్చే ప్రతి వాహనం ఈ గ్రామం మీదుగా వెళ్తుంది. ప్రమాదకరంగా ఉన్న ఈ కల్వర్ట్ వద్ద పోలీస్ శాఖ బారికేడ్లు ఏర్పాటు చేసింది. కాని మున్సిపల్ అధికారులు మాత్రం మరమ్మతు చేయాలనే ఆలోచన చేయడం లేదు. దీంతో ప్రతిరోజూ వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. – వేములవాడరూరల్

నియామకం

అంబేడ్కర్ మాల సంఘం అధ్యక్షుడిగా స్వామి

ముస్తాబాద్: పట్టణ అంబేద్కర్ మాల సంఘం అధ్యక్షుడిగా మీస స్వామి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా పోషరాములు, కోశాధికారి మీస శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా మధుకర్ ఎన్నికయ్యారు. వీరిని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు లగిశెట్టి శ్రీనివాస్, మాజీ సింగిల్‌విండో చైర్మన్ చక్రధర్‌రెడ్డి, నాయకులు హన్మంత్‌గౌడ్, సంతోష్‌రెడ్డి, అంజాగౌడ్, శ్రీకాంత్, సంజీవ్, బండి శ్రీకాంత్, దేవేందర్, ఉపేంద్ర అభినందించారు.

కల్వర్టు నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎంపీపీ మానస

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి గ్రామపంచాయతీ పరిధిలో కల్వర్టు నిర్మాణానికి బుధవారం ఎంపీపీ పడిగెల మానస, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, స్థానిక సర్పంచ్ గనప శివజ్యోతితో కలిసి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బుస్స స్వప్న, సింగిల్‌విండో చైర్మన్ బండి దేవదాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, నాయకులు బుస్స లింగం, నక్క రవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వీవోఏల సమస్యలను పరిష్కరించాలి



సంఘీభావం తెలుపుతున్న గడ్డం నాగరాజు

ఇల్లంతకుంట: రాష్ట్ర ప్రభుత్వం వీఓఏల సమస్యలను పరిష్కరించాలని బీజేపీ మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి గడ్డం నాగరాజు అన్నారు. వీవోఏల సమ్మె 30వ రోజుకు చేరుకున్న సందర్భంగా బుధవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు వీవోఏలకు కనీస గౌరవ వేతనం రూ.10 వేలు ఇస్తామని చెప్పిన సీఎం కేసీఆర్, ఇప్పుడు రూ.3,800 ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న వీవోఏల సమస్యలను ప్రభుత్వం సత్వరమే పరిష్కారం చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు కనీస వేతనం రూ.18 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. గ్రామ సంఘం గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా వీవోఏల ఖాతాల్లో వేతనాలు జమ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సంతోష్, మ్యాకల మల్లేశం, శ్రీనివాస్, మామిడి శేఖర్, సంపత్‌రెడ్డి, వర్ధన్, అఖిల్ పాల్గొన్నారు.

చెరువుల పండుగను విజయవంతం చేయాలి

ఎల్లారెడ్డిపేట: మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో ఈ నెల 8న చెరువుల పండుగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో చిరంజీవి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ గ్రామంలోని మత్స్యకారులు, మహిళలు, అన్ని వర్గాల ప్రజలు చెరువు కట్టకు చేరుకోవాలన్నారు. చెరువు గట్టుపై పండుగ వాతావరణం ప్రతిబింబిచేలా ముగ్గులు, తోరణాలతో అందంగా అలంకరించాలన్నారు. కట్టమైసమ్మకు, చెరువు నీటికి పూజలు చేయాలన్నారు. అనంతరం సభలు, సాంస్కృతిక కార్యక్రమాలు, బతుకమ్మ కోలాటాలు, పాటలుంటాయన్నారు. ఇలాంటి పండుగను అందరు సమష్టిగా విజయవంతం చేయాలని కోరారు. గ్రామాల్లోని చెరువులను నీటిపారుదల శాఖ, రెవెన్యూ అధికారులు పరిశీలించి అన్ని ఏర్పాట్లు చేశారు.

రాష్ట్ర అవతరణపై ఉపన్యాస పోటీలు

ఎల్లారెడ్డిపేట: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ‘తెలంగాణ అస్తిత్వం’, ‘తెలంగాణ ప్రగతిలో సంక్షేమ పథకాలు’ అనే అంశాలపై ఉపన్యాసం, పాటల పోటీలు నిర్వహించారు. దాదాపు 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు త్వరలోనే బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. అధ్యాపకులు క్యాతం సత్యనారాయణ, వాసరవేణి పర్శరాములు, మాదాసు చంద్రమౌళి, చెరుకు భూమక్క, బుట్ట కవిత, నీరటి విష్ణుప్రసాద్ పాల్గొన్నారు.

పోలీసు వాలీబాల్ పోటీల విజేత బోయినపల్లి



వాలీబాల్ విజేత బోయినపల్లి జట్టుకు కప్ అందిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా బుధవారం సిరిసిల్ల పట్టణంలోని మినీ స్టేడియంలో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ పోటీలలో బోయినపల్లి జట్టు విజేతగా నిలిచింది. రన్నరప్‌గా వేములవాడ అర్బన్ జట్టు, మూడో స్థానంలో వీర్నపల్లి జట్టు నిలిచింది. విజేతలకు ఎస్పీ అఖిల్ మహాజన్ బహుమతులు అందజేసి మాట్లాడారు. క్రీడలు మానసిక ఉల్లాసం కలిగిస్తాయని, ఏ ఆటలోనైనా గెలుపు, ఓటమి అనేది సహజం కాని, చివరి వరకు విజయం కోసం పోరాడాలన్నారు. ప్రతి ఒక్కరిలో టీమ్ స్పిరిట్ ఉండాలని అపుడే విజయం మన చెంతకి చేరుతుందని అన్నారు. క్రీడల్లో రాణిస్తే స్పోర్ట్స్ కోటాతో కూడా ఉద్యోగాలకు అవకాశం ఉందన్నారు. పోటీలకు ఏర్పాట్లు చేసిన సీఐ అనిల్ కుమార్, బన్సీలాల్‌ను ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీలు నాగేంద్రచారి, రవికుమార్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

డేంజర్ కార్నర్స్



మూలవాగు ప్రాజెక్ట్ వద్ద ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు



నిమ్మపల్లి-కోనరావుపేట-సిరిసిల్ల ప్రధాన రహదారిపై..



మల్కపేట వద్ద..

కోనరావుపేట: మండలంలోని గ్రామాల్లో పలు చోట్ల ఉన్న మూలమలుపులు ప్రమాదకరంగా మారుతున్నాయి. సిరిసిల్ల–కోనరావుపేట డబుల్ రోడ్డు కావడంతో తరచూ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మూలమలుపుల వద్ద ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. కొలనూర్ గ్రామంలో ఉన్న మూలమలుపు వద్ద ఎలాంటి సూచికలు ఏర్పాటు చేయలేదు. ఈ ప్రాంతంలో గతంలో బోనాలకు చెందిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మల్కపేట, నిజామాబాద్ క్రాసింగ్, ఎల్లమ్మ టెంపుల్ వద్ద, నిమ్మపల్లి ప్రాజెక్ట్ కట్ట కింద మూలమలుపులు భయపెట్టిస్తున్నాయి. వేములవాడ నుంచి మరిమడ్లకు వెళ్లే దారిలో మామిడిపల్లి, బావుసాయిపేట, వట్టిమల్ల గ్రామాల శివారులో ఉన్న మూలమలుపుల వద్ద ప్రమాదాలు జరిగి వాహనదారులు గాయాల పాలవుతున్నారు.

కేటీఆర్ క్రికెట్ ట్రోఫీ విజేత సిరిసిల్ల



విజేత సిరిసిల్ల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నాయకులు

ముస్తాబాద్: కేటీఆర్ క్రికెట్ ట్రోఫీ సీజన్–01 విజేతగా సిరిసిల్ల జట్టు నిలిచింది. ఈ టోర్నీ ఫైనల్ మ్యాచ్‌లో ముస్తాబాద్‌పై గెలిచిన సిరిసిల్ల జట్టు రూ.20 వేల నగదు, ట్రోఫీని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కల్వకుంట్ల గోపాల్‌రావు చేతుల మీదుగా అందుకుంది. అలాగే రన్నరప్‌గా నిలిచిన ముస్తాబాద్ జట్టుకు రూ.10 వేల నగదు, ట్రోఫీని అందజేశారు. బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు మహ్మద్ నవాజ్ ఆధ్వర్యంలో 25 రోజులుగా నిర్వహిస్తున్న పోటీల్లో 70 జట్లు పాల్గొన్నాయి. సర్పంచ్ సుమతి, ఏఎంసీ మాజీ చైర్మన్ జానబాయి, బీఆర్ఎస్ మండల, పట్టణాధ్యక్షులు నర్సింహారెడ్డి, బాలయ్య, కొండ శ్రీను, వెంకటస్వామి, భరత్; అన్వర్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు లబ్ధి చేకూర్చని వారోత్సవాలు ఎందుకు?

కోనరావుపేట: రైతులకు ప్రయోజనం కలిగించని సాగునీటి వారోత్సవాలు ఎందుకని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా ప్రశ్నించారు. మండలంలోని బావుసాయిపేట కొండ్రాయిని చెరువు వద్ద మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో మొదలుపెట్టిన ప్రాజెక్టులను బీఆర్ఎస్ పూర్తిచేయకపోవడమే కాకుండా ఉత్సవాలు నిర్వహించడం విడ్డూరంగా ఉందన్నారు. కొండ్రాయిని చెరువును శ్రీపాద ఎల్లంపల్లి రిజర్వాయర్‌గా మారుస్తామని మధ్యలోనే పనులు నిలిపివేశారన్నారు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తికానందుకు, రైతులకు పరిహారం డబ్బులు ఇవ్వకపోవడమే కాకుండా సాగునీటి వారోత్సవాలు జరుపుకుంటున్నారని అన్నారు. ఉత్సవాల పేరిట ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి బైరగోని నందు, నాయకులు ప్రకాశ్, ధర్మేందర్, మధుసూదన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఎల్లమ్మ సిద్దోగం

బోయినపల్లి: మండలంలోని కొదురుపాక ఆర్‌అండ్ఆర్ కాలనీలో శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో ఎల్లమ్మ సిద్దోగంలో భాగంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర నాయకులు జోగినిపల్లి రవీందర్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, గోపాల్, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు పూర్తి

ఎల్లారెడ్డిపేట: మండలంలోని బుగ్గరాజేశ్వర తండాలో ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేసినట్లు ఏపీఎం మల్లేశం, సర్పంచ్ రజిత తెలిపారు. చివరి ధాన్యం లోడ్ వడ్లను రైస్‌మిల్లుకు తరలించామన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

రుద్రంగి: మండలంలోని మానాల రైతు వేదికలో 18 మంది కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను వైస్‌ఎంపీపీ చిన్న భూమయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతి అందజేశారు.

పుస్తె మెట్టెలు అందజేత

కోనరావుపేట: మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన భూమలింగం–లక్ష్మినర్సవ్వ కూతురు అరుంధతికి బుధవారం పుస్తెమెట్టెలు, నూతన వస్త్రాలను బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి చెన్నమనేని కమలాకర్, చిట్నేని సంజీవరావు అందజేశారు. చిట్నేని ఆగమ్మ నర్సింగరావు ట్రస్ట్ ఆధ్వర్యంలో వెంకటేశ్వర్‌రావు–మాధవి దంపతుల సహకారంతో అందజేస్తున్నట్లు తెలిపారు.

ముస్తాబాద్: ముస్తాబాద్‌కు చెందిన చెవుల భాగ్య, పర్శరాములు కూతురు భవాని వివాహానికి, గొట్టె త్రివేణి, వెంకటరాజం దంపతుల కూతురు జ్యోతి వివాహానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు లగిశెట్టి శ్రీనివాస్ బుధవారం పుస్తె, మెట్టెలను అందజేశారు.